క్లుప్తంగా

ఎన్నిక


శశికాంత్

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బృందావన్ మేడోస్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. అధ్యక్షుడిగా పానుగుపాటి శశికాంత్, ఉపాధ్యక్షుడిగా జగన్‌మోహన్‌చారి, ప్రధాన కార్యదర్శిగా వేణు, సంయుక్త కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా రవితేజ, సభ్యులుగా అరుణ్, రమేష్, కిరణ్, పుల్లారెడ్డి, రఘుమారెడ్డి, సురేష్, రమణలను ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి రోషన్‌దౌలాలోని యూనివర్సల్ బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రకాశ్, ఉపాధ్యక్షుడి రంగయ్య, సెక్రటరీగా ఎస్.కృపాకర్, సుందర్‌రాజు, కోశాధికారిగా ఎం.దిలీప్, సండే స్కూలు డైరక్టర్‌గా జె.వెంకటేశ్, యూత్ డైరక్టర్‌గా జే.డానియల్‌ను ఎన్నుకున్నారు.

అనుమతి లేని బాణాసంచా దుకాణంపై పోలీసుల దాడి


పోలీసులు స్వాధీనం చేసుకున్న క్రాకర్లు

మలక్‌పేట: సౌత్‌ఈస్ట్ టాస్క్ ఫోర్స్, మలక్‌పేట పోలీసులతో కలిసి పేలుడు పదార్థాల అక్రమ నిల్వపై దాడి చేసి వివిధ బ్రాండ్ల ఫైర్ క్రాకర్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ అందె శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. రామ్‌గుప్తా(38) మూసారంబాగ్ డివిజన్ శాలివాహనగర్‌లో సహస్ర ఫుట్‌వేర్ దుకాణంలో ఎలాంటి లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలు(క్రాకర్స్) విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సోమవారం పోలీసులు దుకాణంపై దాడిచేసి క్రాకర్లను స్వాధీనం చేసుకున్నారు.

సిరినగర్‌కాలనీలో వెలగని వీధి దీపాలు

నాగోలు: ఎల్‌బీనగర్‌లోని సిరినగర్‌కాలనీలో రెండు వారాలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంధకారం నెలకొనడంతో రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నామని సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీజేఐపై దాడికి యత్నం అమానుషం



మీర్‌పేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని విశ్రాంత శాస్త్రవేత్త జి.రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి మీర్‌పేట గాయత్రీనగర్‌లోని సమతా భవన్‌లో న్యాయవాదులు, డిప్యూటీ కలెక్టర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సీజేఐపై దాడిని ఖండించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సీజేఐకే రక్షణ లేకపోతే సాధారణ పౌరుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశంలో నిత్యం ఎక్కడో ఓ చోట బలహీన వర్గాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, దాడులను ఎదుర్కొనేందుకు దళిత బహుజన సంఘాలు, వామపక్ష ఉద్యమ సంఘాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. సీజేపై దాడిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో లోకాయుక్త స్టాండింగ్ కౌన్సిల్ జి.సత్యనారాయణయాదవ్, డా.వెంకటేశ్వర్లు, డా.సత్తయ్య, గావరాజు, న్యాయవాదులు విబూది వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, ఎంఎస్ లక్ష్మి, సురేష్, సురేందర్‌రావు, భిక్షమయ్య పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురంలోని రైతుబజారులలో కూరగాయల ధరలు టమాట రూ.20, వంకాయ 45, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 32, బీర 38, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 55, దొండ 28–35, చిక్కుడు 70, గోకర 50, బీట్‌రూట్ 45, క్యాప్సికం 60, ఆలు 23, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 20.ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ముంపు సమస్యకు
విముక్తి ఎప్పుడో?

ప్రతి వర్షాకాలంలో మునుగుతున్న బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు

- హామీలిచ్చి విస్మరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ముంపు కాలనీలో పర్యటిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్(ఫైల్)

ఎల్‌బీనగర్: మేఘాలు కమ్ముకుంటే చాలు.. ఆ కాలనీవాసుల్లో గుబులు మొదలవుతోంది. ఎప్పుడు వర్షం వస్తుందో.. ఎప్పుడు తగ్గుతుందో అని భయాందోళనకు గురవుతుంటారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదేళ్లు కావస్తున్నా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ముంపు సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఎప్పుడు తమ కాలనీ సమస్య తీరుతోందని ముంపు ఎదురు చూస్తునే ఉన్నారు. ముంపునకు గురైనప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేయడం ఇష్టానుసారంగా హామీలు గుప్పించడం ఆ తర్వాత ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముంపు కాలనీలు ఇవే..

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వినూత్ననగర్, గాంధీనగర్, అఖిలాండేశ్వరకాలనీ, స్నేహమయనగర్, పీవీఆర్ కాలనీ బృందావన్ మేడోస్‌కాలనీలు ప్రతి వర్షాకాలంలో ముంపునకు గురవడం సాధారణమైంది. బడంగ్‌పేట మున్సిపల్ పరిధిలోని కొన్ని కాలనీల నుంచి సాగర్ కాంప్లెక్స్ మీదుగా గుర్రంగూడ ఫారెస్టు నుంచి ఈ కాలనీలకు వరద వస్తుంది. వరద రాకుండా ఉండేందుకు గతంలో ఏర్పాటు చేసిన ట్రంక్ లైన్ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో వరద ముంపు పునరావృతం కావడంతో ఎప్పుడు వర్షం వచ్చినా ముంపు తప్పడం లేదు.

ఇటీవల కురిసిన వర్షానికి కాలనీలో ప్రవహిస్తున్న వరద


ట్రంక్ లైన్ నిర్మిస్తేనే..

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో తరుచూ ముంపునకు గురవుతున్న కాలనీలను శాశ్వత విముక్తి చేయాలంటే ట్రంక్ లైన్ నిర్మాణం చేయాలని సర్కిల్–3 ఈఈ రమేష్‌బాబు పేర్కొన్నారు. ముంపు కాలనీల నుంచి నేరుగా హయత్‌నగర్‌లోని కుమ్మరికుంట వరకు వరద నీటి కాలువ పనులు చేపడితే ఇక వరద సమస్య ఉండదని ఆయన సూచిస్తున్నారు.

రోడ్లపై చెత్తవేస్తే చర్యలు తప్పవు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


రోడ్డుపక్కనున్న చెత్తను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. రోడ్లపై గుర్తుతెలియని వ్యక్తులు చెత్తను వేస్తున్నారనే స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన ఆయా ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతంలో మొక్కలు నాటడం, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని నేడు సీసీ కెమెరాలను దొంగలించి గుర్తుతెలియని వక్తులు రాత్రి సమయంలో చికెన్ దుకాణాల్లోని వ్యర్థాలు, రసాయన వ్యర్థాలు వేస్తున్నారన్నారు. ఇక్కడి చెత్తను తొలగించి మళ్లీ ఎవ్వరూ వేయకుండా చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ సర్కిల్ డీసీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విఠల్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, రఘువీర్‌రెడ్డి, రుద్రయాదగిరి, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

సివరేజీ బోర్డు కార్మికులకు సన్మానం


సీవరేజీ బోర్డు కార్మికులను సన్మానిస్తున్న సొసైటీ ప్రతినిధులు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ కాలనీ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి యోగా గురువు మధుసూదన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గడిచిన కాలంలో వచ్చిన ఆదాయం, వ్యయాలపై చర్చించి, కాలనీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మూడు నెలలుగా విద్యార్థులకు ఉచితంగా పాఠాలు చెబుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సివరేజీ బోర్డు కార్మికులను సన్మానించారు. రాబోయే రెండు సంవత్సరాల కాలానికి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకునేందుకు నిర్ణయించారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సూర్యనారాయణ, నాగరాజు, మాజీ అధ్యక్షులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తా


కాలనీవాసులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రశాంత్‌నగర్ కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధిచేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. సీనియర్ సిటిజెన్స్ భవన నిర్మాణం, కనకదుర్గ దేవాలయం ముందు రోడ్డు విస్తరణ, ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద నివారణ, కాలనీలో ఉన్న పార్క్ అభివృద్ధి, చెత్త డంపింగ్ తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు.. సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం రాజగోపాల్, డీఈ రఫీ, ఏఈ శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ ఏఈ విఘ్నేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీ నాయకులు బాలాజీనాథ్, కరుణాకర్‌రెడ్డి, రామారావు, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

సదనంలో మెరుగైన వసతులు కల్పించాలి


వివరాలు తెలుసుకుంటున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: ప్రభుత్వ సదనంలో ఆశ్రయం పొందుతున్న బాలుడు లైంగిక దాడికి గురవ్వడం బాధాకరమని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనాన్ని సందర్శించి సూపరింటెండెంట్ అఫ్జల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సదనంలోని బాలలకు అధికారులు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. లైంగిక దాడి వంటి ఘటనలతో బాలలు మానసికంగా ఒత్తిడికి గురవుతారని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ బాలల సదనంలో సిబ్బంది కొరత ఉన్నారని తమ దృష్టికి వచ్చిందని వెంటనే విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నివేదిస్తానని అన్నారు. బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అసాధారణ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు

చిక్కడపల్లి: కవిగా.. చిత్రకారుడిగా.. నవలా రచయితగా సృజనాత్మక కళ్గిన అసాధారణ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. సోమవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో 'అడవి బాపిరాజు యాదిలో..'ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డా. ఆయాచిత శ్రీధర్ మాట్లాడుతూ... అడవి బాపిరాజు రాసిన 'నారాయణరావు'నవల నేటికీ తెలుగు సాహితీ లోకంలో అత్యుత్తమ కథలలో ఒకటిగా చెప్పుకుంటారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కథక్ అంజిబాబు, గాయకుడు వెంకటరావు, గానసభ పాలకమండలి సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ అయాచితం శ్రీధర్

యూత్ కాంగ్రెస్‌లో పలువురి చేరిక


యూత్ కాంగ్రెస్‌లో చేరిన యువకులు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన సంజుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కోఇన్‌చార్జి రోష్ని జైస్వాల్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి సమక్షంలో యూత్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి యూత్ కాంగ్రెస్ ముందుంటుందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం యువతకు ప్రాధాన్యం ఇస్తుందని, యువత పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం సంజుగౌడ్‌ను యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి, చంద్రిక, విష్ణురెడ్డి, శశిధర్‌రెడ్డి, శివకుమార్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.


సంజుగౌడ్‌ను అభినందిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

సన్మానం

నాగోలు: ఎల్‌బీనగర్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంజుగౌడ్‌ను సోమవారం నాగోలులో తన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్‌లో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయ్యాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లోకేష్,మాణిక్ సాయి,హర్షిత్,సుమన్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కుటుంబానికి అండగా ఉంటాం


చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మధుయాష్కీగౌడ్

ఎల్‌బీనగర్: అమెరికాలో దుండగుల కాల్పులలో మృతి చెందిన ఎల్‌బీనగర్ బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ కుటుంబాన్ని సోమవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ..ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన చంద్రశేఖర్ మృతి వారి కుటుంబ సభ్యులకు భరించలేని విషాదమని గన్ కల్చర్ అమెరికాలో రోజురోజుకు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన పెట్రోల్ బంక్ సీసీ కెమెరా రికార్డులను సేకరించి దర్యాప్తు పూర్తి చేయాలని అక్కడి అధికారులను కోరినట్లు తెలిపారు.చంద్రశేఖర్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్, మార్కెట్ కమిటీ డైరక్టర్ భాషా అశోక్‌గౌడ్, నేలపాటి రామారావు, నాయకులు పార్వతి , గణేశ్ రెడ్డి, వినయ్ పటేల్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి , దేరింగుల కృష్ణ పాల్గొన్నారు.

వరద తగ్గి.. మురుగు నిలిచి



మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మిథులానగర్‌లోని వీధులు బురదతో కంపు కొడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ కాలనీ పూర్తిగా ముంపునకు గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టినప్పటికీ వీధుల్లోని మురుగు మాత్రం అలాగే ఉండిపోవడంతో కాలనీవాసులు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీ వారు బురదను తొలగించకపోవడంతో దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని, కొందరు యజమానులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా కార్పొరేషన్ యంత్రాంగం స్పందించి వెంటనే వీధుల్లోని బురదను తొలగించి బ్లీచింగ్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హుండీ కానుకల లెక్కింపు



చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ కానుకలను సోమవారం సోమవారం లెక్కించారు. ఆదాయం రూ.1,24,764 వచ్చిందని ఈఓ మాచర్ల దేవనాథం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఇన్‌స్పెక్టర్ సురేఖ, అర్చకులు కందాళ వెంకటాది, భక్తులు పాల్గొన్నారు.

బాలుడిపై లైంగిక దాడికి యత్నం

చాంద్రాయణగుట్ట: మైనర్ బాలుడిపై ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన పాతబస్తీ బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..క్యూబా కాలనీకి చెందిన 4వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలుడు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో స్థానికంగా ఉన్న కిరాణాదుకాణానికి టీ పొడి కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఇది గమనించిన ఓ యువకుడు బాలుడిని మాటల్లో దించి పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలుడు కేకలు వేయడాన్ని గమనించిన స్థానికులు అక్కడికే వెళ్లేసరికి యువకుడు పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

విద్యార్థులకు టీచింగ్ పరికరాల అందజేత

సాక్షి, సిటీబ్యూరో: స్టేట్‌కాజ్ వీజేఐటీ విద్యార్థులు బైరామల్‌గూడలోని కీర్తనా ఫౌండేషన్‌లోని పేద విద్యార్థులకు టీచింగ్ కిట్స్ పంపిణీ చేశారు. ప్రాజెక్ట్ ముస్కాన్, ప్రాజెక్ట్ ఉదాన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు ఉపయోగపడేలా వీటిని అందజేశారు. ఈ ప్రత్యేక పరికరాలు విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో విద్యాజ్యోతి ప్రిన్సిపల్ డా.ఎ.సృజన, కోఆర్డినేటర్ సృజన వెంకటాచలం, మెంటార్ సాత్విక, భానుప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

